హడలెత్తిస్తున్న వీధికుక్కలు..

- రోడ్లపై వెళ్తున్నవారిపై దాడులు
- గ్రామాల్లో బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

తానూరు: పల్లెల్లో వీధికుక్కలు హడలెత్తిస్తున్నాయి ..రోడ్లపై వెళ్లే బాటసారులు, వాహనదారుల వెంట పడుతూ భయపెడుతున్నాయి. దీంతో జనం రోడ్ల పైకి వచ్చేందుకు జంకుతున్నారు. రాత్రి గుంపులుగా ఉండి అరుస్తుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఖాళీస్థలాలు, పిచ్చిమొక్కలను ఆవాసంగా చేసుకొని దాడులకు దిగుతున్నాయి. వీధికుక్కల సమస్య పరిష్కరించాలని కోరినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

గ్రామాల్లో శునకాల హంగామా ..

తానూరు మండలంలో 31 పంచాయతీలుండగా.. వాటి పరిధిలో 36 గ్రామాలున్నాయి. ఎల్వి, ఉమ్రి(కే), బెల్‌తరోడా, ఝరి(బి), బోరిగాం, బెంబర, బోల్సా, సింగన్‌గాం, భోసి, మహలింగి, బామ్ని తదితర గ్రామాల్లో వీధికుక్కల సంచారం ఎక్కువైంది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి, వచ్చేటప్పుడు విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది సింగన్‌గాం గ్రామంలో వీధిలో ఆడుకుంటున్న చిన్నారి రితేశ్‌పై వీధికుక్కలు దాడి చేశాయి. సకాలంలో కుటుంబసభ్యులు స్పందించి నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. ఇటీవల షేక్ మైలామయా, భీమ్‌రావ్, అంజనీబాయి, షేక్ ముంతాజ్‌పై కుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. బోల్సా, బోరిగాం, ఉమ్రి(కే) గ్రామంలో మూగజీవాలపై దాడి చేయడంతో పశుపోషకులు ఆర్థికంగా నష్టపోయారు.

జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ..

పొదల్లో ఉంటూ ఒక్కసారిగా వీధికుక్కలు రోడ్డు పైకి రావడంతో ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. మూడు నెలల కిందట బోరిగాం గ్రామ సమీపంలో ద్విచక్రవాహనానికి కుక్కలు అడ్డుగా రావడంతో మహారాష్ట్రంలోని జున్ని గ్రామానికి చెందిన ఇద్దరు కిందపడి గాయపడ్డారు. గత నెల బోల్సా గ్రామ సమీపంలో ధర్మాబాద్‌కు చెందిన వాహనదారుడు కిందపడ్డాడు.

12 మందికి గాయాలు..

మండలంలోని ఆయా గ్రామాల్లో నవంబర్ మాసంలో కుక్కలదాడిలో 12 మంది గాయపడ్డారు. వీరంతా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.



ఉమ్రి(కే) గ్రామంలో తిరుగుతున్న కుక్కలగుంపు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

చిన్నారుల నుంచి పెద్దలపై వీధికుక్కలు దాడి చేయకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను పశువైద్యాధికారి రాజేశ్ వివరించారు.

- కుక్కల గుంపుల వద్దకు వెళ్లవద్దు. వాటిని చూసి పరుగెత్తడం, శునకాలపై రాళ్లు, కర్రలు విసరడం వంటివి చేయొద్దు.
- కుక్కల కళ్లలోకి చూడొద్దు.. కుక్కకాటుకు గురైతే గాయాన్ని శుభ్రంగా కడిగి వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాలి.
- కుక్కల గుంపులున్న గ్రామాల్లో రాత్రి వెళ్లడం తప్పనిసరి అయితే చేతికర్రను వెంట తీసుకెళ్లాలి.
- ఆహార పదార్థాలు, వ్యర్థాలు ఇళ్ల పరిసరాల్లో పడేయకుండా చర్యలు తీసుకోవాలి.
- యజమానులు తమ పెంపుడు కుక్కలకు విధిగా టీకాలు చేయించాలి.
- దాడి చేసినప్పుడు బోర్లా పడుకోవాలి.

కుక్కలను నియంత్రించాలి



గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధికుక్కలను నియంత్రించాల్సిన అవసరం ఉంది. కొంతకాలంగా గ్రామాల్లో నియత్రణ చేపట్టడం లేదు. అధికారులు స్పందించి కుక్కల బెడదను తగ్గించేలా చూడాల్సిన అవసరం ఉంది.

– అవినాష్, బెంబర

చర్యలు తీసుకుంటాం

కుక్కల బెడద అధికంగా ఉన్న గ్రామాల వివరాలను సేకరించి కుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతాం. ఇప్పటికే తానూరు, మొగ్గి గ్రామాల్లో ఉన్న వీధికుక్కలను మరోచోటకు తరలించాం. మండల ప్రజలు ఇబ్బంది పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటాం.

– నసీరుద్దీన్, ఎంపీవో

క్లుప్తంగా

ప్రజలకు అండగా ఉంటా



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్

భైంసాటౌన్: నియోజకవర్గ ప్రజలకు ఏయే కష్టం వచ్చినా తనను సంప్రదించాలని ఎల్లప్పుడూ అండగా ఉంటానని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. మండలంలోని దేగాంకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే.. గ్రామానికి చెందిన భోజారాం పటేల్, పోతన్న, సాయినాథ్‌తో పాటు పలువురికి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేగాం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, అసెంబ్లీ కన్వీనర్ సాయినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న ఎస్సై అశోక్, సిబ్బంది

లోకేశ్వరం: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని మన్మద్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ధ్రువపత్రాలను పరిశీలించారు. వాహనదారులు విధిగా రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. రోడ్లపై ధాన్యం కుప్పలు పోసి ఆరబెట్టవద్దని రైతులకు సూచించారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

కుస్లి రోడ్డు వద్ద తనిఖీలు.

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లి రోడ్డు వద్ద వాహనాలను ఆదివారం ఎస్సై హన్మాండ్లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని సూచించారు. వారి వెంట కానిస్టేబుళ్లు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాత



కల్లూరులో ప్రదర్శననిస్తున్న కళాకారులు

కుంటాల: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని కల్లూరు, అందాకూర్, కుంటాల గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై కళాజాత నిర్వహించారు. రుణమాఫీ, గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలపై కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో కళాకారులు సుదర్శన్, సుధాకర్, లక్ష్మణ్, మాధవి, నాగరాజు, రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.


'విజయోత్సవాల పేరిట ప్రజాధనం వృథా'



మాట్లాడుతున్న నూతన్‌కుమార్

నిర్మల్‌టౌన్: ప్రజాపాలన విజయోత్సవాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధనం వృథా చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా.. ప్రజలకు ఒరిగిందేం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా సంబరాలు ఎందుని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు గౌతమ్‌కృష్ణ, వసుధ, తొడసం శంభు, కామాక్షి తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ఎయిడ్స్ డే



ఎయిడ్స్ డే ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆదివారం ఎయిడ్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఎయిడ్స్ డే అక్షరాల కూర్పులో కూర్చొని ప్రదర్శన చేశారు. విద్యార్థులకు ఎయిడ్స్ గురించి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం ఎంఏ గఫార్, హెచ్‌డబ్ల్యూవో ఆడె బలిరాం, సిబ్బంది ఉన్నారు.

'చలో ఢిల్లీ'లో మాజీ ఎమ్మెల్యే



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఆదివారం చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖాశ్యాం నాయక్ దంపతులు ఢిల్లీ తరలివెళ్లారు. గిరిజన జాతికి రావాల్సిన హక్కుల కోసం ఆలిండియా బంజారా సేవా సంఘ్ వేదికగా ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీల కోసం తీసుకొచ్చిన వక్ఫ్‌బోర్డు చట్టాలను నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు.అందరికీ సమన్యాయం, ఎవరికీ నష్టం జరగకుండా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేతోపాటు వివిధ రాష్ట్రాల నాయకులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కడెం: ఖానాపూర్ మండలం రాజురాకు చెందిన మేరు కులానికి చెందిన డాక్టర్ కొడిగంటి సన్నిత్ కుమార్ ఇటీవల రియాలిటీ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డు అందుకున్నాడు.ఆదివారం మండలంలోని ఎలగడపలో మేరు సంఘం ఆధ్వర్యంలో సన్నిత్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం సన్నిత్‌కుమార్ సంఘం అభివృద్ధికి రూ.10 వేలు విరాళం అందించారు. మేరు సంఘం నాయకులు నారాయణ, రమణ, లక్ష్మణ్, శ్రీనివాస్, కృష్ణ, సత్తన్న, రాపర్తి వెంకటేశ్, భూమేశ్ తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన ప్రజాపాలన విజయోత్సవాలు

- తొలిరోజు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తానూరు: ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో ఝరి(బి) పాఠశాలకు చెందిన జె.విశాఖ, ఎల్వి పాఠశాలకు చెందిన ద్వితీయ స్థానంలో లక్ష్మీకాంత్, తృతీయస్థానంలో ప్రణీత్ నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో నరేందర్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు శంకర్, మాధవ్‌రావ్, సుదర్శన్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో రాజులదేవి విజయ్‌కుమార్, పల్సి పాఠశాల హెచ్‌ఎం డి.సురేశ్, ప్రిన్సిపాల్ వాణి తదితరులు ఉన్నారు.



తానూరు: విద్యార్థులతో ఎంఈవో నరేందర్

ముధోల్: మండలకేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు మండలస్థాయి వ్యాసరరచన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థి సంస్కృతి ప్రథమస్థానంలో, కేజీబీవీ విద్యార్థిని ఎస్.శృతి ద్వితీయ, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఐఈఎస్‌కు చెందిన పి.వంశీ తృతీయస్థానంలో నిలిచారు. అనంతరం వీరికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, పురుషోత్తం, చాట్ల భూమేశ్వర్, కేజీబీవీ ఉపాధ్యాయురాలు జ్యోతి, పాల్గొన్నారు.



కుభీర్ కస్తూర్బాలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



ముధోల్‌లో గెలుపొందిన విద్యార్థులు



నర్సాపూర్(జి): పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కానిస్టేబుల్ కిష్టయ్యకు ఘన నివాళి



నిర్మల్‌లో నివాళులర్పిస్తున్న కమిటీ సభ్యులు



ముధోల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర సాధనలో తొలి అమరుడు పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ అని కిష్టయ్య కోర్ కమిటీ సభ్యులు దేవేందర్, యాటకారి సాయన్న అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో పోలీస్ కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి నిర్వహించారు. అంతకుముందు మయూరి హోటల్ సమీపంలో రోడ్డుపై కిష్టయ్య చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలో కిష్టయ్య విగ్రహం ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్ కమిటీ సభ్యులు ఉమామహేశ్వర్, సుంకరి సాయి, సుంకరి మహేశ్, మందుల పోశెట్టి, సత్యం, పోతన్న, నరేశ్, శ్రీనివాస్, సాయన్న, రాజనర్సయ్య, భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ముదిరాజ్ సంఘ సభ్యులు, నాయకులు మలిదశ తెలంగాణ అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ 15వ వర్ధంతి నిర్వహించారు. ఎస్సై హన్మాండ్లు, నాయకులు గడ్డం ఇంద్రకరణ్‌రెడ్డి, కొంద్ర రమేశ్, ముదిరాజ్ కోర్ కమిటీ జిల్లా సభ్యులు ఉమామహేశ్వర్, పిట్ల సాయన్న, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన పోలీసు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వంశీ ముదిరాజ్, సభ్యులు ముదోల్ల శంకర్, ఆలూరి ప్రశాంత్, పిట్ల రాజ్‌కుమార్, శ్రావణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జగన్నాథ్‌రావు చౌరస్తాలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కానిస్టేబుల్ కిష్టయ్య 15వ వర్ధంతి నిర్వహించారు.

ముధోల్: మండలకేంద్రంలో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షుడు ప్రవీణ్, సాయి, బీజేపీ మండలాధ్యక్షుడు కోరి పోతన్న తదితరులున్నారు.

అనాథాశ్రమం పేరిట డబ్బుల వసూలు

కడెం: అనాథాశ్రమం పేరిట డబ్బులు వసూలు చేస్తూ ఇద్దరు మహిళలు పట్టుబడిన ఘటన కడెం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఇద్దరు మహిళలు ఆదివారం అనాథాశ్రమం పేరిట మండలంలోని కొండుకూర్, పాండ్వపూర్, తదితర గ్రామాల్లో డబ్బులు వసూలు చేశారు. వారిపై అనుమానం వచ్చి కొండుకూర్‌లో యువకులు నిలదీయడంతో తప్పుడు అనాథాశ్రమం పేరిట తామే డబ్బులు వసూలు చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విచారించి మహిళలను పంపించినట్లు సిబ్బంది చెప్పారు.



కొండుకూర్‌లో పట్టుబడిన మహిళలు

కిష్టాపూర్ చేరిన సైకిల్‌యాత్ర

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మం కాపాడుతూ సన్మార్గంలో పయనించాలని మహారాష్ట్రకు చెందిన రామకృష్ణ దశరథ్ స్వామిజీ అన్నారు. మహారాష్ట్ర నుంచి షోలాపూర్ జిల్లా ఉలే గ్రామానికి చెందిన రామకృష్ణ దశరథ్ స్వామిజీ గోదావరి జన్మస్థలమైన త్రయంబకేశ్వర్ నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం మండలంలోని కిష్టాపూర్ గ్రామం చేరింది. ఈసందర్భంగా స్వామిజీకి గ్రామస్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. హనుమాన్ ఆలయంలో పూజలనంతరం ప్రజలకు హిందూ ధర్మం గొప్పతనం వివరించారు. తాను మొదటిసారిగా 2004లో సైకిల్‌యాత్ర చేపట్టానని.. సప్త నదుల్లో ఒకటైన పవిత్ర గోదావరి ప్రాశస్త్యాన్ని, సనాతన ధర్మం ప్రజలకు వివరించేందుకు ఈసారి యాత్ర చేపట్టినట్లు స్వామిజీ తెలిపారు.



స్వామిజీతో కిష్టాపూర్ గ్రామస్తులు

గజ్జలమ్మ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, అర్చన, పల్లకిసేవ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

జనవరి 4 నుంచి గిరిజన సదస్సు

ఖానాపూర్: కాంగ్రెస్ ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో జనవరి 4 నుంచి 11 వరకు ఎనిమిది రోజులపాటు నాగార్జునసాగర్‌లో పార్టీ ముఖ్యులతో గిరిజన సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ సదస్సుకు జిల్లాకు చెందిన గిరిజన ముఖ్యనాయకులు హాజరుకావాలని కోరారు. ఎస్టీలకు గత ప్రభుత్వాల హామీలు, భవిష్యత్ కార్యాచరణపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సింహగర్జనకు తరలిన నేతలు



భైంసా నుంచి వెళ్తున్న నాయకులు



సోన్: న్యూవెల్మల్ నుంచి వెళ్తున్న నాయకులు

భైంసాటౌన్/కుంటాల/లక్ష్మణచాంద/నర్సాపూర్(జి)/సోన్/తానూరు/ఖానాపూర్: సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన మాలల సింహగర్జన సభకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తాలూకా అధ్యక్షుడు శంకర్ చంద్రే ఆధ్వర్యంలో భైంసా నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. కుంటాల మండలం నుంచి నియోజకర్గ ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, కార్యదర్శి లస్మన్న ఆధ్వర్యంలో పలువురు తరలివెళ్లారు. ఖానాపూర్ నుంచి వెళ్లిన వారిలో నాయకులు ద్యావతి రాజేశ్వర్, నేత శ్యాం, దాసరి రాజన్న, మ్యాదరి రాజేశ్వర్, దాసరి రాజేశ్వర్, మేసు సతీశ్, మైస శ్రీనివాస్, భాస్కర్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్ నుంచి వెళ్తున్న నాయకులు

నేడు క్విజ్ పోటీలు

సోన్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సోమవారం ఉదయం 10గంటలకు సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్విజ్‌పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈవో పరమేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 8.9, 10 తరగతుల నుంచి ఒక్కొక్కరు చొప్పున పోటీల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందిస్తామని వివరించారు.

మున్సిపల్ చైర్మన్ పర్యటన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని 14వ వార్డు పరిధిలోని విద్యానగర్ కాలనీలో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పర్యటించారు. కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. చైర్మన్ వెంట స్థానిక కౌన్సిలర్, తదితరులు ఉన్నారు.

హరినామ సప్తాహం



విఠలరుక్మాబాయి ప్రతిమలు

భైంసారూరల్: మండలంలోని మహాగాం విఠలేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అఖండహరినామ సప్తాహం ప్రారంభమైంది. వారం పాటు ఉదయం, సాయంత్రం జ్ఞానేశ్వరి పారాయణం, గాథ భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం



లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2009-10లో పదోతరగతి పూర్తి చేసిన చెందిన విద్యార్థులు ఆదివారం లక్ష్మణచాందలోని రాధాక్రిష్ణ ఫంక్షన్‌హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమ ఉన్నతికి కారణమైన గురువులను సత్కరించారు.

ముగిసిన ట్రస్మా స్పోర్ట్స్ మీట్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2024 ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగుపందెం, ఇతర అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సెక్రెటరీ గంగన్న, ట్రెజరర్ వినోద్, పట్టణ అధ్యక్షుడు చంద్రగౌడ్, పాఠశాలల యజమానులు మంచిరాల నాగభూషణం, సాయన్న యాదవ్, పోతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.